అతని
పరిచయం కోసం
ఆశపడిన
ఆమెకు
ఎదురైన పరిస్థితి?

**రాగతి పండరి కథ**

# అతను వచ్చాడు

రామకృష్ణా బీచ్‌లో ఆ రోజు...

ఆమే, ఆమె స్నేహితురాలు సముద్రానికి కొంచెం దూరంలో ఇసుకలో కూచొని వున్నారు. జనం పల్చగా వున్నారు. చల్లని సాయంత్రం

చక్కని గాలి హాయిని కలిగిస్తున్నాయ్.

ఉన్నట్టుండి ఆమె కళ్ళ ముందు మెరుపులు మెరిసాయ్ ...

విశాలమైన కళ్ళు మరింత విశాలమైయాయ్. వాళ్ళకి కొంచెం దూరంలో కూచొని దీక్షగా సముద్రాన్ని చూస్తున్నాడతను. ఆమె అటే చూస్తోంది.

అతని ముఖం పక్కసైడు నుంచి కనబడుతోంది. వెనుకభాగం పూర్తిగా కనబడుతోంది. గోధుమరంగు సిల్క్ లాల్చీ, పైజమా వేసుకున్నాడు. వొత్తయిన క్రాపు, కోటేరు ముక్కు అందంగా కనబడుతోంది. ఆ లేత నీరెండలో దబ్బపండులా మెరుస్తున్నాడు.

ఆమె గుండె లయ తప్పింది.

''తన కలల రాజు అతనే!'' అనుకుంది ఆమె.

''ఎంత బాగున్నాడు! ఎంత బాగున్నాడు!'' ఆమె పదేపదే అనుకుంటోంది.

''ఇదిగో అటు చూడు!'' స్నేహితురాల్ని మోచేత్తో పొడిచింది.

''ఏవిటే...?''

''అతను చూడు — ఎంత బావున్నాడో...''

''అవును సముద్రుడేనా? చాలా బావున్నాడు!!''

''చాల్లే...! నే చెప్తున్నది సముద్రుడి గురించేం కాదు!''



"మరేమిటే...?"

"మొద్దు మొహం!"

"సర్లే... తర్వాత తీరుబడిగా తిడుదూ గాని... ముందు సంగతేవిటో చెప్పు!!"

"అదిగో... మన ఎదురుగా కూచున్నాడు అతన్ని చూశావా?"

"ఎవరూ... ఆ సిల్క్‌లాల్చీవాలానేనా?"

"అవును బావున్నాడు కదూ...?"

"ఎందుకు బాలేదూ... అచ్చూ హిందీ సిన్మా హీరోలా వున్నాడు!"

"కాదు అంతకన్నా బావున్నాడు...!"

"అయితే ఏవిటట...?"

"నీ మొహమట!"

"అబ్బ! చెప్పవే బాబూ...!!"

"ఏం చెప్పను... అతన్ని చూడగానే నా మనసు అదోలా అయిపోయిందే...!!"

"అయ్యో పాపం!" "అయితే నీకూ వచ్చేసింది!!"

"ఏవిటే?!"

"ప్రేమ పైత్యం...!!"

"పర్లే గాని... అతగాడికి చాలా తలబిరుసులా వుంది!"

"ఏం నువ్వు పట్టి చూశావా?!"

"నోరుముయ్!"

"మరెలా తెల్సు...?"

"మనం వచ్చి పావుగంట అవుతుందా... అప్పట్నుంచి అలా సముద్రంవైపే చూస్తూ కూర్చున్నాడు...!"

"నీ వైపు చూడమని చెప్పాలా?"

"ఆట్టే వాగకు పళ్ళు రాలతాయ్ ..."

"సరేగాని ఓసారి ఆ కెరటాల దగ్గరకెళ్ళి విందుందాం రారాదూ...!?"

"అబ్బ... నే రానులే...!!"

"ఏం...? నీ హీరోని చూస్తూ కూచుంటావా!?"

"అవును...!!"

"అయితే నే వెళ్ళి కాసేపు నీట్లో వించొని వస్తా!!"

"మంచిది వెళ్ళు!"

"ఇదిగోవే బాబూ... నా 'హీల్స్' కాస్త చూస్తుండు నీ పక్కన పెట్టి వెళ్తున్నా!!"

ఆమె దృష్టంతా అతనిమీదే వుంది. ఒక్కసారి అతను ఇటుచూస్తే బావుండు... అవును అతను తన్నిచూస్తే చాలు ఆ తర్వాత అంతా తను అనుకున్నట్టే జరుగుతుంది.

తన అందం అలాంటిది!!

ఒక్కసారి చూస్తే చాలు చూపు తిప్పుకోలేక అవస్థ పడతారు అబ్బాయిలు.

తలంటి పోసుకుని లూజుగా అల్లుకున్న జడ, మెడ మీద నుండి వీపుని ముద్దాడి నడుం మీదగా ఇసుకని తాకుతోంది. లైట్‌గా లిప్‌స్టిక్ పూసిన పెదాలు ఆ సంధ్య కాంతిలో వింతగా మెరుస్తున్నాయ్. రివ్వు రివ్వున వీస్తున్న గాలికి పదేపదే ఆమె పైట జారిపోతోంది.

ఆమెకి టెన్షన్‌గా వుంది!

"అతను ఇటు చూస్తే బావుండు... చూస్తాడా? ఏవిటంత మరీ జిడ్డుమనిషిలా వున్నాడు... పరిసరాల వైపు కన్నెత్తి చూడ్డేం. .. ఇంత దగ్గరలో ఇంత అందమైన అమ్మాయి కూచుని వుండగా చూపు తిప్పడేం..."

దూరంగా ఆమె స్నేహితురాలు కెరటాలు ఆమె పాదాల్ని తడిపివేస్తుంటే కేరింతలు కొడుతోంది.

అతను హఠాత్తుగా ఇటువైపు తల తిప్పేడు.

ఆమె కళ్ళు అతని కళ్ళల్లో చిక్కుబడిపోయాయ్.

ఒక్కసారిగా సముద్రపు అలలలో మునిగినట్లుగా ఆమె ఒళ్ళు జల్లుమంది.

కంగారుగా కళ్ళు తిప్పుకుంది.

అతను ఆమె వైపే చూస్తున్నాడు.

ఆమె గర్వంగా ఫీలయింది. పెదాల ఎరుపు బుగ్గలకి పాకింది.

అతను లేచి నిలబడ్డాడు. ఆమె వైపు నడుస్తున్నాడు. ఫ్రంట్ సైడులో మరెంతో బావున్నాడు.

ఆమెకి భయంవేసింది. ఆనందం కలిగింది. ఇంకా ఏదో ఏదో తెలియని గుబులు రేగింది. అతను వస్తున్నాడు... తన దగ్గరకే అతను వస్తున్నాడు... వచ్చి ఏమంటాడు?

మీ అందం నన్ను మైమరపించింది. అయ్ లవ్ యూ... అంటాడా??... ఆమెకి చేతులు వణుకుతున్నాయి. పెదాలు అదురుతున్నాయి. గుండె ఎగసెగసి పడుతోంది. ఒళ్ళు తేలిపోతోంది.

అతను దగ్గరయ్యాడు.

ఆమె కళ్ళు దించుకుంది. అతను మృదువుగా అన్నాడు. "ఎక్స్‌క్యూజ్ మీ...!!"

ఆమె బరువుగా తలెత్తి చూసింది.

అతను వేడికోలుగా అడిగాడు.

"కాస్త ఆ కెరటాల దగ్గర నించొని వస్తాను... అందాకా నా 'షూస్' ఇక్కడ విడుస్తాను... కొంచెం చూస్తుండండి మేడమ్..."

ఆమె సమాధానం కోసం చూడకుండా అతను బూట్లువిప్పి ఆమెకి కాస్త దగ్గరలో పెట్టి వడివడిగా సముద్రంకేసి సాగిపోయాడు.

ఆమె ఖంగుతిన్నట్టు చూస్తూ వుండిపోయింది.

